
# పెరిగిన పోలింగ్ శాతం

**- కంటోన్మెంట్ ఉప ఎన్నికలో ఓటేసేందుకు తరలిన ఓటర్లు ● పెరిగిన ఓటింగ్‌తో ప్రధాన పార్టీల్లో ఉత్కంఠ**

*పార్లమెంట్‌తో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నిక మనకెందుకులే అనుకోకుండా ఈసారి ఓటుహక్కు వినియోగానికి కంటోన్మెంట్ నియోజకవర్గ ఓటర్లు ముందుకొచ్చారు. ఈ కారణంగానే గత ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కంటోన్మెంట్‌లో 47.14శాతం ఓటింగ్ నమోదైతే.. ఈసారి 51.61 శాతంగా నమోదై అందరి దృష్టిని ఆకర్షించింది. కొత్తగా ఓటు హక్కు పొందిన యువతీ యువకులతో పాటు మహిళలు ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాల ఎదుట బారులు తీరారు. – కంటోన్మెంట్, మే 14:*



ఆరో వార్డులో ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం సిరా గుర్తును చూపిస్తున్న ఓటర్లు

**ప్రతి ఓటూ కీలకం**

శాసనసభ ఎన్నికల్లో పెరుగుతున్న పోలింగ్ శాతం, పార్లమెంటు ఎన్నికలు వచ్చే సరికి తగ్గుతున్నది. ఇందుకు ప్రధాన కారణం శాసనసభ పరిధి తక్కువగా ఉండటంతో ప్రతి ఓటు కీలకంగా మారి గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశాలు ఎక్కువ ఉంటాయి. అందుకే ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్న అందరి వివరాలు తెలుసుకొని వలస ఓటర్లను రప్పించి మరీ ఓట్లేయించుకుంటున్నారు. దీంతో కంటోన్మెంట్‌కు జరిగిన ఉప ఎన్నికల పోలింగ్‌లో గతంలో కంటే 4శాతానికి పైగా పెరిగింది. అయితే పోలింగ్ శాతం పెరగడంతో ప్రధాన పార్టీల్లోని అభ్యర్థులకు ఉత్కంఠగా మారింది. పెరిగిన 4శాతం ఓట్ల కారణంగా గెలుపోటములపై ప్రభావితం చూపే అవకాశం ఉండడంతో లెక్కల్లో తలమునకలయ్యారు. ప్రధానంగా వార్డుల వారీగా నమోదైన ఓట్లను సరిచూసుకోవడంతో పాటు పోలింగ్ బూత్‌ల వారీగా లెక్కలు తెప్పించుకుని మరీ కుస్తీలు పడుతున్నారు.

బస్తీలు, కాలనీల్లో ఉన్న ట్రెండ్‌ను తెలుసుకుంటూ మంగళవారం సైతం అభ్యర్థులు బిజీగా గడిపారు. ఈసారి మార్పు కోసమే ప్రజలు ఓటింగ్‌కు తరిలారని కాంగ్రెస్ పార్టీ అంటుండగా, తండ్రి, చెల్లిని కోల్పోయిన నివేదిత సాయన్నకు అండగా నిలిచేందుకు కంటోన్మెంట్ ఓటర్లు కదం తొక్కారని బీఆర్‌ఎస్ శ్రేణులు భావిస్తున్నారు. మరోవైపు బీజేపీ శ్రేణులు మోడీ చరిష్మాతో పాటు పార్లమెంట్ ఎన్నికలు తోడవడంతో గెలుపుపై ధీమాతో ఉన్నట్లు చెప్పుకుంటున్నారు. ముఖ్యంగా మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపుపై ఎవరి ధీమాలో వారు ఉండగా వచ్చే నెల 4న కౌంటింగ్ జరుగుతుండటంతో ఎవరి భవితవ్యం ఏమిటో తేలనుంది.

## అప్పు చెల్లించమన్నందుకు కత్తితో దాడి

వెంగళరావునగర్, మే 14: తీసుకున్న అప్పు తిరిగి చెల్లించమన్నందుకు ఓ వ్యక్తి కత్తితో దాడికి పాల్పడిన ఘటన ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సనత్‌నగర్‌లోని అశోక్ కాలనీకి చెందిన మహ్మద్ అహ్మద్ ఖాన్ ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి 11.30 గంటల సమయంలో తన మిత్రులైన ఖలీమ్, సయ్యద్, జాహిద్‌లతో కలిసి అమీర్‌పేట ప్రాంతానికి టీ తాగేందుకు వెళ్లారు. తిరిగి వస్తూ మార్గమధ్యలో బీకేగూడ వద్ద కూరగాయల సంత లో నిమ్మకాయల వ్యాపారం చేసే అమీన్‌ను కలిశారు. అహ్మద్ ఖాన్ మిత్రుడైన ఖలీమ్ వద్ద గతంలో అమీన్ రూ.5వేలు తీసుకున్నాడు. తీసుకున్న అప్పు తిరిగి ఎప్పుడు ఇస్తావని ప్రశ్నించడంతో ఘర్షణ చోటు చేసుకుంది. అహ్మద్ ఖాన్, ఖలీమ్‌లు ద్విచక్ర వాహనంపై తిరిగి వెళ్లబోగా కోపంతో అమీన్ జేబులో నుంచి కత్తి తీసుకుని అహ్మద్ ఖాన్‌పై దాడికి పాల్పడ్డాడు. అహ్మద్ ఖాన్‌కు కత్తిపోట్లకు గురయ్యాడు. బాధితుడిని దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి..

హిమాయత్‌నగర్, మే 14: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేసే కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడు తూ.. అనేక పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను అమలు చేయడంలో కేంద్రం నిర్లక్ష్యం వహిస్తూ, ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

## కనుల పండువగా స్వామి వారి కల్యాణం





స్వామి వారికి కల్యాణం చేస్తున్న దృశ్యం, తిలకిస్తున్న భక్తులు

అమీర్‌పేట్, మే 14:ఎస్ఆర్‌నగర్‌లోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి 29వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. మూడు రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు మంగళవారం స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయం చైర్మన్ బొడ్డు కుమార్‌గౌడ్, ఈవో నరేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చారు. సాయంత్రం కల్యాణ ఉత్సవ విగ్రహాలకు ఎస్ఆర్‌నగర్ వీధుల్లో ఊరేగించారు.









## సనత్‌నగర్ నియోజకవర్గంలో.. 49.41 శాతం పోలింగ్



సనత్‌నగర్‌లోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసిన అనంతరం సిరా గుర్తును చూపిస్తున్న ఓటర్లు

బేగంపేట్, మే 14: సనత్‌నగర్ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల అధికారులు, పోలీసులు పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 2,53,381 మంది ఓటర్లు ఉండగా సాయంత్రం 6 గంటల వరకు 49.41 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. సుమారు యాభై శాతం మంది ఓటర్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా యాభై శాతం పోలింగ్ దాటలేదు. నియోజకవర్గంలో ఆరు డివిజన్‌లలోనూ ఉదయం 7 నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు అనుమతినిచ్చారు. సనత్‌నగర్, అమీర్‌పేట్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్, మోండామార్కెట్‌లలోని ఆరు డివిజన్‌లలో మొత్తం 229 పోలింగ్ స్టేషన్‌లలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 50.59 శాతం ఓటింగ్ జరుగగా ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో 49.41 శాతమే పోలింగ్ జరిగింది.

## కార్మికులకు అండగా ఉంటాం..

కేపీహెచ్‌బీ కాలనీ, మే 14 : కార్మికులకు అండగా ఉండి సేవలందించేందుకు ఎల్లప్పుడు సిద్ధమని బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ అన్నారు. నగరంలోని ఖాజాగూడలో జూబ్లీ రెడీమిక్స్ కంపెనీ యజమాని నారాయణ రెడ్డి దగ్గర షబ్బీర్ అనే కార్మికుడు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న షబ్బీర్‌ను ఆకస్మాత్తుగా పని నుంచి తొలగించడంతో పాటు అతనికి ఇవ్వాల్సిన రెండు నెలల జీతం డబ్బులను ఇవ్వలేదు. బాధిత కార్మికుడు యజమానిని జీతం డబ్బులు ఇవ్వాలని పలుమార్లు వేడుకున్నా ఫలితం లేకపోవడంతో కార్మిక సంఘం నాయకుడు రవిసింగ్‌ను ఆశ్రయించాడు. వెంటనే కంపెనీ యజమానితో చర్చలు జరిపి కార్మికుడికి రావాల్సిన రూ.40 వేల జీతం డబ్బులను ఇప్పించాడు. కార్యక్రమంలో సం ఘం నాయకులు అనిల్, సుదర్శన్, జగన్, ప్రేమ్, కిరణ్ ఉన్నారు.

## ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు వినతుల వెల్లువ

కుత్బుల్లాపూర్, మే 14 : కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మంగళవారం నియోజకవర్గానికి చెందిన పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు, పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలపై వినతిపత్రాలు అందించారు.



2024 మే 13న పార్లమెంట్ ఎన్నికలు జరుగగా ఆ ఈవీఎంలను ఉస్మానియా వర్సిటీలో స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేసి భద్రపరిచారు. స్ట్రాంగ్ రూం వద్ద ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పహారా కాస్తున్నారు.







**పట్నం చేరుకుంటున్న పల్లె ప్రజలు:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2024 మే 13 సోమవారం పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. నగరంలో ఉంటున్న పల్లె ప్రజలు ఓటు వేయడానికి తమ సొంతూర్లకు వెళ్లి ఓటు వేసి తిరిగి నగరానికి చేరుకుంటున్నారు.మంగళవారం పల్లె ప్రజలు పట్నం చేరుకోవడంతో జూబ్లీ బస్‌స్టేషన్ ప్రయాణికులతో సందడిగా మారింది.

## ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకుని.. అక్రమ నిర్మాణం



జమాల్‌బస్తీలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకుని వెలిసిన అక్రమ నిర్మాణం

కాచిగూడ,మే 14 : జమాల్ బస్తీలో ట్రాన్స్‌ఫార్మర్ ఆనుకుని అక్రమ నిర్మాణం వెలిసింది. అసలే ఇప్పుడు వేసవి సెలవులు.. వానలు పడినపుడు ప్రమాదం జరిగితే పరిస్థితి ఏంటని స్థానికులు వాపోతున్నా రు. వివరాల్లోకి వెళితే.. పాత కాచిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదురుగా, ఏకే భవన్ రోడ్, జమాల్‌బస్తీలో అనుమతులు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే అక్రమ నిర్మాణం వెలసింది. బస్తీలో 350 కుటుంబాలు నివసిస్తుంటాయి. చిన్నారులు ఆడుకుంటూ అటుపోతే ఎలా.. అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని స్థానికులు ఆరోపించారు.

## మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

మైలార్‌దేవ్‌పల్లి, మే 14: మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం అవుతూ మరింత ముందుకు సాగాలని ఎస్ఓఎస్ సంస్థ సీఈవో సుమంత కర్ అన్నారు. మంగళవారం గండిపేట మండలం వట్టినాగులపల్లి గ్రామంలోని ఎస్ఓఎస్ బాలల గ్రామంలో స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్ఐడీబీఐ) వారి సహకారంతో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఈడీపీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఓఎస్ సంస్థ సీఈవో సుమంత కర్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ.. వట్టినాగులపల్లిలోని ఎస్ఓఎస్ సంస్థలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా గ్రామీ ణ ప్రాంతాల్లోని మహిళల నైపుణ్యాలు, వ్యాపారాలను అభివృద్ధి చేయడం ద్వారా వా రి జీవన ప్రమాణాలను మెరుగుపర్చవచ్చు నన్నారు. ఎస్ఐడీబీఐ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, డిప్యూటీ మేనేజర్ రామకృష్ణలు మాట్లాడుతూ.. ఈ సంస్థ ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అందిస్తున్న పథకాలను వివరించి చిన్న వ్యాపారులను ప్రోత్సహించడానికి ఎల్లవేళలా కృషి చేస్తుందని పేర్కొన్నారు.

లివింగ్‌హుడ్ డైరెక్టర్ జిత్‌కుమార్ మాట్లాడుతూ.. చిన్న చిన్న వ్యాపారాలు చేస్తున్న మహిళలకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం వివిధ సంస్థలు అందిస్తున్న ఆర్థిక వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలల గ్రామీ ణ సంచాలకులు కొ ట్రేష్ మాట్లాడుతూ .. ఎస్ఐడీబీఐ సంస్థ మహిళలకు అందిస్తున్న సేవలు ఎంతో గొప్పవన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల్లో ఎస్ఓఎస్ సంస్థ ద్వారా లబ్ధిపొందుతున్న మహిళలు, ఎస్ఓఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## యువకుడు ఆత్మహత్య

కవాడిగూడ, మే 14 : ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకున్నది. గాంధీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బన్సీలాల్‌పేట బండమైసమ్మ నగర్ నివాసి అబ్దుల్ రజాక్‌కు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్దవాడైన అబ్దుల్ షోయబ్ (20) నిరుద్యోగి. రెండేండ్ల క్రితం రోడ్డు ప్రమాదం జరిగి రెండు కిడ్నీలు పాడైన్నాయి. దీంతో అతడు ఇంట్లోనే ఉంటున్నాడు. జీవితంపై విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పనులు ముగించుకొని ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులకు అబ్దుల్ షోయబ్ ఉరివేసుకొని కనిపించాడు. వెంటనే గాంధీనగర్ పీఎస్‌కు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేసుకున్న పోలీసులు గాంధీ దవాఖానకు తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నయీం తెలిపారు.

## వృద్ధుడు మృతి

కాచిగూడ, మే 14 : గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు (60) శంషాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం – 2లో కొన్నిరోజులుగా అనారోగ్యంగా ఉంటూ మంగళవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడి ఒంటిపై నీలిరంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ఉందని, ఎత్తు 5.3 ఉన్నట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

## బొట్టు బిల్లలతో జై శ్రీరామ్..




బొట్టు బిల్లలతో రూపొందించిన జై శ్రీరామ్ చిత్రాన్ని ప్రదర్శిస్తున్న పద్మావతి, సూర్యకుమారి, యోగలక్ష్మి, తదితరులు

ఖైరతాబాద్, మే 14 : అయోధ్యలోని శ్రీరామమందిర నిర్మాణం పూర్తయి ఏడాది కావస్తున్న సందర్భంగా మహిళా ఆర్టిస్టులు ఓ వినూత్న బహుమతిని రూపొందించేందుకు సంకల్పించారు. హైందవ సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బొట్టు బిల్లలను పేర్చి జై శ్రీరామ్ ఆకారంలో తీర్చిద్ది తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉమెన్ ఆర్టిస్టు అసోసియేషన్ ప్రతినిధులు, మహిళా ఆర్టిస్టులు కాసుల పద్మావతి, సూర్యకుమారి, యోగలక్ష్మి ప్రతిభా, రజనీ, కోమలిలు ఆ అద్భుత చిత్రకళ రూపకల్పన విషయాలను వివరించారు. తాము చేపట్టిన ఈ వినూత్న ప్రక్రియకు అయోధ్య ప్రాజెక్టుగా నామకరణం చేశామన్నారు. బొట్టు బిల్లలతో జై శ్రీరామ్ ఆకారం తయారు చేయడానికి 16,314 నారింజ బిల్లలు, 3192 నీలం, 13,464 ఆకుపచ్చ మొత్తం 32,970 బిల్లలు వినియోగించామని వెల్లడించారు. 60గంటల్లో ఈ రికార్డు ఫీటును పూర్తి చేశామన్నారు. ఈ ఆకృతిని ఆయోధ్య శ్రీరామమందిరం వద్ద ఉన్న మ్యూజియంకు అప్పగిస్తామన్నారు.

## రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత - మూడేండ్లుగా విధుల్లోలేని ఎస్సైలు

కాచిగూడ, మే 14 :కార్పొరేట్ స్థాయిలో ఉండి ఏ –1 రైల్వేస్టేషన్ గుర్తింపు పొందినా.. తొలి కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరతతో కేసుల పరిష్కారం జాప్యం అవుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. నిత్యం రైల్వేస్టేషన్ నుంచి 60–80 వేల మంది తమ తమ గమ్యస్థానాలకు వెళ్తుంటా రు.ఎస్సైలు బదిలై మూడేండ్లు కావస్తున్నా ఇప్పటికీ అధికారులు నిమమించకపోవడం గమనార్హం. ఇక్కడ ముగ్గురు ఎస్సైలు ఉండాలి. కానీ.. 13 మంది హెడ్‌కానిస్టేబుల్ ఉండాల్సి ఉండ గా 11 , 53 మంది కానిస్టేబుల్స్ ఉండాల్సి ఉండగా 14 మంది, 8 మంది హోంగార్డులు ఉండాల్సిన చోట ఒక్కరూ లేరు. ఇది విడ్డూరంగా ఉందని.. ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## చురుకుగా డ్రైనేజీ నిర్మాణ పనులు



మల్లేపల్లి డివిజన్‌లో డ్రైనేజీ నిర్మాణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. మల్లేపల్లి చికెన్ మార్కెట్ చౌరస్తా వరకు రూ.45లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను మంగళవారం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. – మెహిదీపట్నం

## మల్లేపల్లిలో పారిశుధ్య పనులు



నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్‌లో జీహెచ్‌ఎంసీ సర్కిల్ – 12 పారిశుధ్య విభాగం అధికారులు మంగళవారం చెత్త తరలింపు పనులను చేపట్టారు. వారం రోజులుగా ఎన్నికల నేపథ్యంలో ఆయా పనుల్లో ఉన్న అధికారులు మంగళవారం సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి బస్తీల్లో పారిశుధ్య పనులు చేయించారు. – మెహిదీపట్నం





**ఉపశమనం:** ఓ పక్క ఎండలు.. మరోపక్క ముగిసిన ఎన్నికల వేడి..దీంతో సందడిగా మారిన జలవిహార్.. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందడానికి నగర ప్రజలు మంగళవారం చిన్నా పెద్దా అనే తేడా లేకుండా స్విమ్మింగ్ చేస్తూ..ఇలా సేద తీరుతున్నారు.